# అమృతవాక్కులు



సేకరణ : పెసల సుబ్బరామయ్య
ప్రతులకు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్టు
గొలగమూడి
నెల్లూరు జిల్లా - **524 321**

## శ్రీ మాష్టారి అమరబోధ

నీవు ఏ పని చెయ్యడానికి అంగీకరిస్తావో ఆ పని క్షుణ్ణంగా చెయ్యి. లేకుంటే ఆ పని చేసేందుకు అంగీకరించకు.

(1) నాతిచరామి (2) నన్ను 5½ గంటల బస్సుకు పంపడం (3) ఏ టీచరూ చేయలేనంతగా పని చేయాలి.

కలిచేడు గోపాల్ పెండ్లి భోజనాల సమయంలో శ్రీ మాష్టరు గారు వారి విస్తరలో వడ్డించిన వంటకాలు అన్నీ తాకి వదిలేసి అన్నం మధ్యలో పెరుగుతో కలిపి రెండు ముద్దలు తిని వదిలేశారు. ఏమి సార్ అలా చేశారంటే "సుబ్బరామయ్యా పెండ్లి నాడు అర్థేచ, కామేచ, ధర్మేచ, మోక్షేచ, నాతిచరామి అని ప్రమాణం చేస్తాము. ఇవన్నీ రుచిగా ఉన్నాయని తింటే "కామేచ" అన్నదానిని తప్పినట్లవుతుంది అన్నారు. పెండ్లినాడు భార్యను అలా చూస్తానని అంగీకరించాము. దానిని తప్పకూడదు" అన్నారు.

నేనెప్పుడు విద్యానగర్ నుండి కలిచేడు రావాలన్నా వేకువజాము 5½ గంటల బస్సుకే అలారం పెట్టి లేపి పొమ్మనేవారు. 6 గంటల బస్సుకు పోనిచ్చేవారు కాదు. 5½ గంటల బస్సుకుపోతే 9 గంటలకు చేరుతాను, 10 గంటలకు స్కూలు. 6 గంటల బస్సుకుపోతే 10 గంటలకు చేరుతాను. స్నానం చేయకుండా టిఫిన్ చేయకుండా వెంటనే బడికి వెళ్ళి ఏమి పాఠాలు చెప్పగలుగుతాము. కనుక మనం చేస్తానని అంగీకరించిన పని చక్కగా చేయాలంటారు.

"ఏ టీచరూ చేయలేనంత గొప్పగా విధి నిర్వహణ చేయాలి" అని చెప్పేవారు. కనుక ప్రతి క్లాసుకు ఏ పాఠాలు చెప్పాలో ముందే తయారైపోవాలి. ఈరోజు పరీక్ష పెడితే రేపు ఆన్సరు పేపర్లు దిద్ది ఇచ్చేయాలి.

ఈనాడు అన్నీ రంగాలలో ఎవరు చేయవలసిన పని వారు చేయకుండుటచే సంఘం కృళ్ళిపోతుంది. భగవంతుడు మనకిచ్చిన పని చేయకుండా వారికి టెంకాయలు కొడుతూ పొర్లు దండాలు పెడితే సంతోషిస్తారా. లంచాలు తీసుకోను అని ఉద్యోగమిచ్చేటప్పుడు ప్రమాణం చేసి ఇప్పుడు లంచాలు పుచ్చుకుంటే భగవంతుడు మనలను క్షమిస్తాడా?

నీవే నా తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ - - - అందరూ అని నిత్యం హారతులలో వారి దగ్గర ప్రమాణం చేస్తూనే అన్నదమ్ములు ఒకరి నొమ్ము ఒకరు మింగాలని, తల్లిదండ్రుల ఎడల మన సేవా కర్తవ్యం మానేస్తే మనమెన్ని పూలమాలలు వేస్తే ఏమౌతుంది. నీకు భగవంతుడు ఇచ్చిన పని చక్కగా నిర్వర్తించు అంటారు. విద్యార్థులు వారి డ్యూటీ ఉపాధ్యాయులు, వ్యాపారులు, ఉద్యోగులు ఆశను వదలి వారి వారి డ్యూటీ చేస్తే రామ రాజ్య మేర్పడక ఏమౌతుంది అంటారు శ్రీ మాష్టారు. మోసం నాశనం అన్న పెద్దల సామెత మరువరాదు.

## అమృతవాక్కుల సమ్మేళనము

1. పూజ: యాంత్రికము, లాంచనప్రాయమైన పూజ వలననే సత్వర ఫలితాలు కల్గడంలేదు అంటారు శ్రీ మాష్టారు.



**యాంత్రికమంటే** - మానసికంగా పూజను గురించి చింతనే లేకుండా టేప్‌రికార్డు క్యాసెట్టు లేక C.D. లలో వలె శబ్దం మాత్రం నోటితో చేయడం. మనం ఉచ్చరించే పదాల అర్థంగాని వాటికి సంబందించిన లీలలుగానీ చింతన చేయకపోవడం.

**లాంచనప్రాయము** - వివాహాలలో బోలెడు లాంచనములున్నాయి. పెండ్లికొడుకు, పెండ్లికూతురు ఇద్దరికీ జీలకర్ర బెల్లం నెత్తిన పెట్టడం, అరుంధతిని చూపించడం ఒకరి కాలి బొటనవేలు మరియొకరి చేత తొక్కించడం ఇలాంటివెన్నో ఉన్నాయి. అవి ఎందుకు చేయిస్తారో వాటి అర్థమేమిటో తెలియకుండానే చేసెయ్యడం. నేడు ఎక్కువమంది పూజకూడా అలానే చేస్తున్నారు.

2. పూజ ఎలా చేయాలి: అష్టోత్తరంగానీ, సహస్రనామంగానీ చదివేటప్పుడు ఆ నామాల అర్థం తెలుసుకొని చదవడం ముఖ్యం. అందుకే బాబాగారు విష్ణుసహస్రనామం పుస్తకం షామాకు ఇస్తూ రోజుకు రెండు మూడు నామాలైనా అర్థంతో మననం చేయమంటారు. నామం యొక్క అర్థంతోపాటు ఆ అర్థానికి సంబందించిన లీల మననం చేయమంటారు. ఒక నోట్సు పూజ చేసేటప్పుడు దగ్గర పెట్టుకొని కూర్చోవాలి. ఒక పేజీకి ఒక నామం వ్రాసుకునేది. ఆ నామానికి సంబందించిన లీలను సంక్షిప్తంగా అక్కడ వ్రాసుకునేది. కొన్నాళ్ళకు అన్నీ నామాలకు లీలలు వచ్చేస్తాయి. కొన్ని నామాలకు లీలలు గుర్తురాకుంటే వదలి వేయవచ్చు. ఎప్పుడో వారి కృపవలన అన్నీ నామాలకు లీలలు దొరుకుతాయి.

**పూజ చేయడం - శ్రీ మాష్టారి ఆచరణ:** శ్రీ సాయిమాష్టర్ దివ్యస్మృతులు అనే గ్రంథంలో K.ప్రసాద్‌గారు తాను చూచిన విషయం

వివరించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు శ్రీ మాష్టరు పూజచేసేవారట. 4 గంటల సేపు ఎలా చేశారు అనేది ప్రశ్న? ప్రతి నామమూ చాలా నెమ్మదిగా పలుకుతూ ఆ నామానికి సంబందించిన లీలను మననం చేసేవారు. ఒకే నామం లీలా మననం అయిపొయ్యేవరకు ఉచ్చరిస్తుండేవారు. ఈ విషయాన్ని శ్రీ మాష్టారు తన రచనలలో అనేకమార్లు పొందుపరచారు.

**సత్సంగము:** ప్రతి సత్సంగములోనూ పారాయణ ముఖ్యము. నామావళిలోని నామాల అర్ధాలకు వివరణే దివ్యలీలలు. ఈ లీలలు మననం చేయడం, వినడం జరిగినంతసేపు నామాలనే మననం చేస్తున్నామన్నమాట. దీనినే జ్ఞానేశ్వర్ మహారాజ్ భగవద్గీతలో 17 వ అధ్యాయం 14 వ శ్లోకంలో శారీరక తపస్సు, వాచక తపస్సు, మానసిక తపస్సు అని చెపుతారు. శ్రీ మాష్టారు చెప్పినట్లు పారాయణ చేస్తుంటే మూడు రకముల తపస్సులు చేసినట్లే అవుతుంది. సత్సంగాలంటే గొప్ప ఉపన్యాసాలు మందిరాలు అక్కరలేదు. ఎవరి ఇండ్లల్లోనైనా నలుగురు చేరి భగవంతుని ప్రతిరూపాలైన మహనీయుల దివ్యలీలలు చెప్పుకొని వినడం కూడా తపస్సే అవుతుంది. దీనినే గీతలో దేవద్విజగురుప్రాజ్ఞపూజనం అన్నారు.

**మందిరాలలో పనిచేసే సేవకులు:** వారి డ్యూటీ చేయకుండా మరచిపోతే ఆ పని మనం చేయకూడదంటారు శ్రీ మాష్టారు. భవగంతుని సేవ అని మనం నిత్యం ఆ పని చేస్తుంటే జీతం తీసుకునే సేవకుడూ చేయడు. మనం కూడా ఒకరోజు మందిరానికి రాక ఆ పని చేయము. కనుక ఆ పని లేక సేవ అట్లా లోపిస్తుంది. కనుక ఆ సేవకుడు మరచిపోయిన పని అతని చేతనే చేయించాలి అని మాష్టారి



ఆజ్ఞ. ఇది శ్రీ వెంకయ్యస్వామి వారు కూడా నాకు చెప్పడం జరిగింది. ఎప్పుడూ మరచిపోకుండా రెండు అరికాళ్ళు ఒకేచోట కాల్చి బోధించారు.

## మనస్సును అరికట్టే మహాగొప్ప సులువు

గీచిపారేసిన అగ్గిపుల్ల, చించిపడేసిన కాగితం ముక్కను తీసుకొని ఇవి ఇక్కడ ఈ క్షణంలో ఉండేవి. వీటిని మీకు చూపిస్తూ నేను ఈ విధంగా చెప్పడం అంతకు ముందు నిర్ణయానుసారమే. అదే బాబా చెప్పిన "రైల్లో జానెడు చోటివ్వమన్న వారికి ఈ ఊధీపొట్లమివ్వు" అని చెప్పిన దానికి అర్ధము. ఫలానా చోట ఫలానా పాము ఉంటుంది, లాంతరు తీసుకుపొమ్మనడము. ఇలాంటివెన్నో ఉన్నాయి.

ఈ సత్యాన్నే శ్రీ మాష్టారిగారి అన్నగారైన శ్రీ వేదవ్యాసగారు నాతో స్వయంగా చెప్పిన విధము. ఒక హరిజన కుర్రవాడు గొప్పమేధావి. అతి గొప్ప పేదవాడు. శ్రీ వేదవ్యాస్ గారి తన ఇంట్లో భోజనం పెడుతూ ఇంటర్మీడియట్ చదివిస్తున్నాడట. శ్రీ వేదవ్యాసగారికి ఆ పిల్లవాడు భవిష్యత్తు చాలా బాగా చెప్పగలడనిపించి అడిగితే నాకు తెలియదు సార్ అన్నాడు. నేను నీకు అన్నం పెడుతున్నాను. నాకు అబద్దం చెప్పకూడదంటే ఇక తప్పించుకోలేక పది తెల్ల కాగితములు తెప్పించి వాటికి తేదీవేసి ఇక పదిరోజులలో పేపరులో నిత్యం రాబోయే మెయిన్ హెడ్డింగులన్నీ వ్రాసిపెట్టాడట. తర్వాత ఆ విధ్యార్ధికి వేదవ్యాసగారికి జరిగే సంభాషణంతా వ్రాసిపెట్టాడట. ఈ కాగితం కవరులో పెట్టి ఆ కవర్పైన ఒక తేదీవేసి ఆ రోజు విప్పిచూడమన్నారట. ఆరోజు ఆ కవర్ విప్పేందుకు వీలులేక వేదవ్యాస్గారు మరొకదేశంలో ఉండిపోయారు. అటు తర్వాత ఐదు రోజులకు వచ్చారు.

తాను వచ్చేసరికి ఆ విద్యార్థి మెట్లమీద కూర్చొనున్నాడు. రాగానే నమస్కరించి సార్ ఆ కవరు సంగతి అని గుర్తుచేశాడు. నీవామాట అడుగుతావని అనుకుంటున్నాను అని కవరు తెచ్చి చించబోతున్నాడు. ఇంతలో వాళ్ళిద్దరిమధ్య వాళ్ళ పెంపుడు కుక్క పోయింది. ఇప్పుడీ కవరు చించి ఈ సంభాషణలో పడితే ఇంట్లో వాళ్ళు కాఫీ త్రాగమని అంతరాయం తెస్తారు. కాఫీ త్రాగి వస్తానని వెళ్ళి వచ్చి కవరు చించాడు. కవరు పైన వేసిన తేదీకి అది చించలేదు.

కవరు చించి చూస్తే "ఈ కవరు ఈ తేదీన ఇన్ని గంటలకు చించుతారు. వేదవ్యాసగారు ఇన్ని గంటలకు వచ్చేసరికి నేను మిద్దెమెట్లపై కూర్చొనుంటాను. మా సంభాషణ ఇలా జరుగుతుంది అని పై సంభాషణంతా వ్రాసి ఉన్నాడు. అంతేకాక వారి మధ్య పెంపుడు కుక్క పోవడం కూడా వ్రాశాడు. అంతేకాక ఆ కాగితములు వ్రాసేటప్పుడే పదిరోజుల ముందు పేపరులో వచ్చే పెద్ద హెడ్డింగులు, అందులోని చిత్రపటాలు అన్నీ వ్రాసిపెట్టాడు.

అంటే ఏ కుక్క ఎప్పుడు ఎక్కడ నడిచేది ముందే నిర్ణయించబడి అలాగే జరుగుతుంది. ఎవరినోటిగుండా ఏమాట వచ్చేది ముందే నిర్ణయించబడి ఉంది. ఏ పేపరులో ఏ ఏ వాక్యాలు ప్రింటవుతాయనేది నిర్ణయించబడి ఉంది. ఇలా అన్నీ ముందు నిర్ణయం ప్రకారం జరుగుతుంటే భవిష్యత్తును గూర్చి యోచిస్తూ B.P. పెరిగిపోవడం తప్ప జరిగే ప్రోగ్రాంలో మార్పు ఉండదు అని తెలుసుకుంటే మన ఆలోచన మనం మానగలము. లేకుంటే కొత్తవి తగులుకుంటాయి. పైన ఆ విద్యార్థి వ్రాసిన వ్రాతలో ఆలోచనలను గురించి వ్రాయలేదు. కనుక భవిష్యత్తును గూర్చి చింతించడం మాను, అంటారు శ్రీ మాష్టారు. అట్లాగే జరిగిపోయిన దాన్ని గూర్చి ఆలోచించకు. భవిష్యత్తు, గడచిన కాలము Future and Past రెండు కాలాల ఆలోచనలూపోతే ఇక live in the present



చేయగలమని మాష్టారు చెప్పారు. అలా చెయ్యాలంటే ఎంతో పట్టుదల ఆధ్యాత్మికతపై ప్రీతి ఉండాలి. మనసును అరికడితే మనం మెట్లమీద కొచ్చామని అర్థం, ఇక మిద్దెక్కడం అతి సులభం.

## సాధకులకు మేలుకొలుపు

ముఖ్యంగా ఇంద్రియలోలత్వం గురించి చెపుతూ అన్నారు: ఉదాహరణకు ఒక మంచి తినుబండారం - మనకు ఇష్టమైనది కనిపిస్తే తినేస్తాము. ఆకలై కాదు. నోరూరడం వలన తింటాము. ఇంద్రియ లోలత్వం సాధించాలని ఆ పదార్థాన్ని చూడకుండా ప్రక్కకు తప్పుకోవడం, కళ్ళు మూసుకోవడం పద్ధతికాదు. అలా చేసినప్పుడు తినాలనే సంస్కారము ఇంకా గట్టిపడుతుందే కానీ మనలను వదలదు. విశ్వామిత్రుని కథంతా దీనికి ఉదాహరణే. తపస్సు చేయాలని కూర్చొని ఘోరంగా చేస్తున్నాడు. రంభ వచ్చి తనచుట్టూ తిరిగి నృత్యం చేయగానే తపోభంగము చేసుకొని ఆమెను మోహించి పెండ్లి చేసుకొని బిడ్డలనుకన్నాడు. ఇలా వేలసంవత్సరాలు గడిచాయి. అనేకమార్లు భ్రష్టుడయ్యాడు. స్త్రీలు కంటపడగానే వారి పొందుకోరే సంస్కారము మనలో ఉంది. అది చావాలిగానీ వారినుండి చాటుకు వెళితే ఎప్పుడైనా మనం పతనమయ్యే సంస్కారము మనలో ఉండి అది మనపతనానికి పొంచే ఉంటుంది. అదే సుకమహర్షి జనకుని దగ్గరకు వెళ్ళినప్పుడు జనకుడు వారి దగ్గరకు వేశ్యలను పంపి పరీక్షిస్తే ఏకాంతము లభించిన గదిలో కూడా వారు సమాధిస్థితులౌతారు. ఆయన మనిషికాదు. అది ఒక బండరాయి అని వేశ్యలే ఓడిపోతారు. సుకమహర్షిలో కామవాసనలు కాల్చివేయబడ్డాయి. విశ్వామిత్రునిలో ఆ వాసనలకు ముసుగు వేయబడ్డాయి. ముసుగులో నుండి ఎప్పుడయినా బయటకు వచ్చి మన ధ్యేయాన్ని సర్వనాశనం చేస్తాయి.

రుచిగల పదార్థాలు తినాలి అనే కోరిక, దాని సంస్కారము, ఆ వాసన మనలో చావాలి, ఆ వాసనను మన ***వివేక విచారాల*** ద్వారా కాల్చాలి - బాగా కాల్చాలి. సద్గురు కృప అనే గాలి తగిలినపుడు బాగా కాల్చబడి జయం చేకూరుతుంది. అంతేగానీ ఆ పదార్థాలు కంటితో చూడకుండా తప్పుకుంటుంటే ఎన్నాళ్ళకైనా ఎన్ని జన్మలకైనా ఆ సంస్కారము, వాసన మనలో ఉండి మన పతనాన్ని మనమే సిద్ధంగా ఉంచుకున్నామన్నమాట. అన్నీ విషయాలలోను ఇది వర్తిస్తుంది.

అందుకే శ్రీ వెంకయ్యస్వామి వారు ఆకలైనప్పుడు లడ్డుపెట్టినా వద్దనరు. కానీ ఆ లడ్డుకు లేక మిఠాయికి కారపుపొడిగానీ, పచ్చడికానీ కలిపి దాని రుచి చంపి తినేవారు.

శ్రీ సాయినాథుని చుట్టూ ఎన్ని మిఠాయిలు, పండ్లూ పెట్టినా అవన్నీ తన చేతులతోనే వచ్చిన భక్తులకిచ్చి తాను మాత్రము ముతక రొట్టెనే తినేవారు.

తన విస్తరలో ఎన్నో రుచికరమైన కూరలుండగా ఉప్పు, కారం లేని అరటి దబ్బలు నా కొరకు తీసుకవోయినవి కొన్ని విస్తరలో పెడితే అవన్నీ తినేశారు. వాటినే మరలా మరలా పెడితే నేను తీసుకవెళ్ళిన ఉప్పులేని దబ్బలన్నీ తిన్నారేకానీ ఆ రుచిగల కూరలజోలికి పోలేదు. ఇంద్రియలోలత సాధించడమంటే ఇలా ఉండాలని ఆచరణద్వారా బోధించారు. రుచిగల కూరలు విస్తరలో ఉన్నాగానీ రుచిలేని దానినే స్వీకరించాలని బోధిస్తున్నారు.

అమ్మాయిలను చూస్తే అబ్బాయిలకు, అబ్బాయిలను చూస్తే అమ్మాయిలకు భావాలలో తేడా వస్తుందని వాళ్ళుండే తావుకు పోకుండా, వారి మొఖం చూడకుండా దాక్కుంటే ఎన్నాళ్ళకూ మనలోని



ఆ కామసంస్కారాలు, కామవాసనలు చావవు. వాటిని వివేక విచారాలు, సద్గురుకృప అనే గాలి ద్వారా కాల్చాలి. ఆత్మను శుద్ధిచేసుకోవాలి అన్నారు.

కొందరు జిహ్వాచాపల్యం పోగొట్టుకోవాలని రుచిగల పదార్థాలు అసలు తినడమే మానేస్తారు. రుచిగల పదార్థాలు తినకున్నా పరవాలేదు. శరీర అవసరాలైనా తీరాలి గదా. ఈ శరీరం అనే యంత్రం నడవడానికి అవసరమైన ఆయిల్ మనము తినే ఆహారము. దాన్ని బొత్తిగా లేకుండా చేస్తే మనం మహనీయులం కాగలమా? మహనీయులు చేసినట్లు చేయకూడదు. మహనీయులు చెప్పినట్లు చేయాలి.

**మనసు స్థిరముగా ఉండక చంచలముగానుండుటకు కారణమేమి?**

<u>అచార్యులవారి అమృతవాక్కు</u>

మన పూర్వపాపమే ఈ చంచలత్వమునకు కారణము. పాపము నశించుమార్గమేది ?

సర్వ పాపక్షాళనకు గురుసన్నిధి, గురుసేవ, గురుచింతన అనే వాటికిమించిన సాధనలే లేవు. ఒక కాలేజీ విద్యార్థి వచ్చి - సార్ మీరేదైనా ఒక సాధన చెప్పండి తప్పకచేస్తాను. ధ్యానమా, నామజపమా, పారాయణ, పూజ, స్తోత్రపఠనము ఏది చేయమంటే అదిచేస్తాను అన్నాడు.

అందుకు శ్రీ మాష్టారు చెప్పిన అమృత సలహా - ఈ నాటి మన మనస్సు గత జన్మల పాపపుణ్యాల మిశ్రమము. పాపం అనుభవ మయ్యేటపుడు ఒక రకంగాను, పుణ్యం అనుభవమయ్యేటప్పుడు మరొక

రకంగాను ఉంటుంది. నిత్యం నియమంగా కొంత టైం గురుసేవకని కేటాయించి మనకెన్ని పనులున్నా ఆ టైంలో గురుస్మరణ తప్పక చేయాలి. భగవంతుడు మననుండి కోరేది మనకాలము, మనస్సు, కృతజ్ఞతాభావము. మనం కేటయించుకున్న కాలంలో మన గత పుణ్య పాపాలను బట్టి ఏమి చేయాలని మనసు కోరితే అదిచేయడమే. ఒకరోజు పూజచేయాలనిపిస్తే మరొక రోజు పారాయణ ముందుచేయాలంటుందీ మనస్సు. మరొకరోజు నామజపం, ఇంకొక రోజు స్తోత్రం మరొకసారి ప్రదక్షిణలు. ఇవన్నీ గురు సేవలే అనే నమ్మికతో ఏ రోజు ఏమిచేయాలనిపిస్తే అది చేయడమే. ఇలా కొంతకాలం చేయగా చేయగా వారి కృప వలన తప్పక మనస్సుయొక్క చాంచల్యము తగ్గుతుంది.

యద్ భావం తద్ భవతి అన్నారు

నీ భావమెట్లా ఉంటే ఫలితమలాగే ఉంటుంది అన్నారు. ప్రతినిత్యం మనం చేసే ప్రతిపనీ వారి సేవగా భావించి సత్యం, ధర్మం తప్పకుండా చేస్తూ పోవడమే సాధన. <u>పూజ, పారాయణ వగైరా చేసినప్పుడు మాత్రమేగాక ప్రతిక్షణము మనం వారిలో ఉన్నామనే ఏమారని ఎరుక కలిగి ఉండమన్నారు</u>. వారు అనుక్షణం మన్వైపు చూస్తూనే ఉన్నారని మనం వారిని పిలవని సమయంలో కూడా మన రక్షణకు రెడీగా ఉండి రక్షిస్తున్నారనే మాట మరువరాదు. స్మృతిరహిత ప్రసన్నులైన ఆ మహనీయునితో భక్తుల అనుభవాలన్నీ స్మృతిరహిత ప్రసన్నాయ నమ: అనే చిన్న పుస్తకంలో వేశాము. కనుక అన్నం సంపాదించినా, అన్నం వండినా, అన్నం తిన్నా, వ్యాపారం కానీ, వ్యవసాయంగానీ, ఉద్యోగం కానీ, కూలి పని కానీ ఏదైనా ఆ మహనీయుని సేవే అనే భావం చెదరకుండా చేస్తుంటే పని చేసే సామర్ధ్యము, కార్యదీక్ష పెరిగి మనకు ఉత్తమ స్థితి కల్గుతుంది.



ఆశా వ్యామోహాలలో తగుల్కొని మనం చేసేపని సద్గురుసేవ అనే మాట మరచి సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధరణత్వం, సద్గురుసేవ అనే భగవదాజ్ఞను వదలితే నేల విడిచి సాము చేసిన వాళ్ళమవుతాము. ఎన్నిమార్లు మన మొక్కుబడుల ప్రకారం మన కష్టాలు తీర్చినా మనం వారి శుభ్రమార్గంలో నడువలేనప్పుడు మనం వారితో వ్యాపారం చేసిన వారమవుతాము. కనుక భగవంతుడు పిలిచిన వెంటనే పలుకుతున్నాడనే విశ్వాసం కలిగినాకనైన వారుచూపిన బోధించిన సత్యం, ధర్మం అనే మార్గం మనమాచరించలేకపోతే చేతికి చిక్కిన వజ్రాన్ని పోగొట్టుకున్నట్లు భగవంతుని అండపోగొట్టుకుంటాము.

మనం చేసే ప్రతిపనీ వారిసేవ అనే భావం చెదరకుండా చేస్తుంటే ఋణానుబందాలు తొలగిపోయినపుడు నిరంతరం ప్రత్యక్ష గురుసన్నిధి, గురుస్మరణకు వీలైన పరిస్థితులు కలుగుతాయి. అలా వారి ప్రత్యక్ష సన్నిధి దొరకనినాడు వారి చరిత్రపఠనము, మననమూ, యాంత్రికము, లాంచనప్రాయము కాని పూజ, గురుస్తుతి (మనకు చేసిన మేలు స్మరించడం) చేస్తూ మరొక వైపు సర్వజీవులు భగవంతుడే ననే ఎరుకతో పరోపకారం చేస్తూ పోతుంటే మనసు దానంతట అదే నిలచి పోతుంది అంటారు శ్రీ మాష్టారు. మన పాపంకంటే పుణ్యం పెరగాలి. పుణ్యఫలమే మనకు సర్వం సమకూరుస్తుంది. అందుకే సాయినాధుడు నీ పూర్వ పుణ్యం గట్టిది గనుక ఇక్కడికి వచ్చావు అంటారు.

శ్రీ మాష్టరుగారు కుక్క ఈనితే - కుక్క ప్రసవించింది అని దానికి పెరుగన్నం నోట్లో పెట్టి మూతి తుడిచి దుప్పటి కప్పుతారు. మరొక రోజు కొత్తపాలెం నుండి పరుగెత్తి, పరుగెత్తి విద్యానగర్ సత్‌సంగ గదిలో ముందుకాళ్ళుంచి నిలబడ్డ ఎద్దుకు బక్కెట్టుతో నీళ్ళుపెట్టి, పసుపు కుంకుమ ముఖాన పెట్టి అరటిపండ్లు తినిపిస్తారు.

గొలగమూడిలో రోడ్డుపైన తేలు కనబడితే అందరూ చెప్పులతో కొట్టబోతే చటుక్కున తన చేత్తో దాన్ని కంపలోకి దోసేస్తారు కానీ కొట్టనివ్వరు.

తాను పెండ్లి కాకముందు ఒక్కరే ఉండేటప్పుడు నిత్యం వచ్చే నాలుగు కుక్కలకూ పెద్ద పింగాణి ప్లేటునిండా అన్నం పెట్టి వరుసగా ఒక్కొక్క కుక్కకు పెట్టేవారు.

విద్యానగర్ సత్‌సంగ హాలులోకి ఎందరు వచ్చినా ఆ హాలులో పడుకున్న కుక్కలను మాత్రం బయటికి తోలేందుకు వీలులేదు. వచ్చిన భక్తులందరికీ పెట్టిన దానికంటే రెట్టింపుగా కుక్కలకు ప్రసాదం పెట్టేవారు.

ఎందరు బిక్షగాళ్ళు వచ్చినా కలకండవంటి ప్రసాదం గానీ ఉన్న పండ్లలో పెద్దవి మంచివికానీ ఇచ్చేవారు. ఏమీ లేకుంటే హుండీలో డబ్బు తీసి ఆ బిక్షగాళ్ళకిచ్చేవారు. పాత గుడ్డలర్ధించిన బిక్షగాండ్లకు సరిగంచు పంచెల దగ్గరనుంచి వారి వారి అదృష్టం కొద్దీ చేతికి దొరికినవి ఇచ్చేవారు.

ప్రతి నిత్యము ఆరు, ఏడు తరగతులు చదివే చిన్నపిల్లలు కొందరికి పాఠాలు చెప్పేవారు.

పరీక్షలు వ్రాసేందుకు పిల్లలు పోతుంటే కాలేజీగేటు దగ్గర నిలుచొని wish you best of luck అని చెయ్యి ఊపుతుండేవారు. ఈ పని ఏ లెక్చరరూ చేయలేదు.

ఎందరో వ్యక్తులు తమకు బ్రతుకు తెరవులేదంటే తన దగ్గరున్న డబ్బేగాక బ్యాంకులోనున్న డబ్బు చాలకుంటే హుండీలోని డబ్బు ఇచ్చి



వ్యాపారం చేసుకోమని ప్రోత్సహించేవారు. ఎవరో తప్పితే తిరిగి ఆ డబ్బు ఇవ్వని వారే ఎక్కువమంది.

ఎందరో తెలివిగల విద్యార్ధులు పోస్టుగ్రాడ్యుయేషన్ చేయలేని ఆర్థిక పరిస్థితులలో వారి సర్వఖర్చులు భరించి పోస్టుగ్రాడ్యుయేషన్ చేయించారు.

ఎందరికో కాలేజీ ఫీజులు కట్టి పుస్తకాలు తీసిచ్చారు. పై జీవులందరిలోను వారు భగవంతునే చూస్తూ తన గురుదేవులే ఉన్నారనే భావం చెదరకుండా సహాయమందించారు. ఇక రోగార్తులను ఆదుకున్న వారికి లెక్కేలేదు.

శ్రీ మాష్టారు చెప్పిన మాటలు ఎవరికి చెప్పారో అవి వారికే వర్తిస్తాయి గానీ అందరికీ సరిపోతాయనుకోవడం పొరపాటు. ఉదాహరణకు అనేక మందికి ధ్యానం చేయమని చెప్పేవారు, ఎలా చేయాలో చెప్పేవారు. మరి నాకు ధ్యానం చేయడం ఎలాగో చెప్పమంటే దాంతో నీకేం పని అని అంటూ అంతరంగాన్ని పరిశుద్ధం చేసుకోకుండా చేసే ధ్యానమంతా గజస్నానమే. శత్రుమిత్రులనెడి భేదము, కావాలి, వద్దు, అనే ఇష్టా ఇష్టాలు నశింపజేసుకోవాలి అని అన్నారు.

అలాగే పారాయణ చేయండి, పూజ చేసుకోండి, మీ సమస్యలు బాబాకు చెప్పండి. వారు తప్పక మన సమస్యలు పరిష్కరిస్తారు అని కొందరికి చెపితే మరినాకు బాబాను పిలవకూడదు అన్నారు. పిలిస్తే పలుకుతారు అన్న నమ్మకం లేనప్పుడు పిలిచి చూచి - పిలిస్తే పలుకుతారనే నమ్మకం కలిగాక ఇక పిలువకూడదు. మన ప్రయత్నం

మనం చేస్తుంటే వారే మనలను సరైన ప్రయత్నం చేసేటట్లు ప్రేరేపిస్తారు అన్నారు. వారి సుబ్రమార్గంలో నడపమని ప్రార్థించమన్నారు.

పారాయణ, పూజ, హారతులు, ప్రార్థనలు, స్తోత్రాలు, కొందరితో చేయండి, బాగా చేయండి అని చెపుతూనే, మరి కొందరితో యాంత్రికము, లాంఛనప్రాయమైన పారాయణ, పూజ, హారతులు, స్తోత్రాలు మానండి, అందుకే సత్వర ఫలితాలు రావడం లేదు. సజీవమైన పారాయణ పూజ వగైరా చేయండి సత్వర ఫలితాలు పొందండి అని చెప్పేవారు.

మనకు తీవ్రమైన బాధ కలిగి ఎటుపోవాలో తెలియని పరిస్థితులలో బాబాను పిలిచి మనకు మార్గము చూపమని అడిగే పద్ధతులు వారే ఆరుమార్లు ఆరు రకాలుగా చూపారు.

1. దీక్ష చేసి పారాయణ ప్రదక్షిణలు చేసి మార్గముపదేశించమని అడగడం, ఉదాహరణకు వారు వివాహం చేసుకోవాలా వద్దా అనే విషయంలో బాబాను అడిగిన పద్ధతి.
2. చీట్లు వేయడం: ఇంటర్వ్యూకి వెళ్ళడమా లేక అదే రోజుకు షిరిడీలో ఉంటానని పూర్వం చెప్పుకున్న మాట ప్రకారం షిరిడీ వెళ్ళడమా అని రైల్వేస్టేషన్‌లో అగరొత్తి వెలిగించి చీట్లు వేశారు.
3. విద్యానగర్‌లో ఉండడమా లేక మరొక చోటుకు వెళ్ళడమా అనే సంశయంలో - ఒక అరగంట లోపల ఈ రూములోకి మొదట ఎవరు వచ్చి ఏ సలహా చెపితే అదే పాటిస్తాను అని కూర్చోనుండడం.
4. ఈ చరాచర సృష్టంతా బాబా రూపమే. కానీ ఈ వచ్చే వ్యక్తి మనకు చాలా ఇబ్బంది కల్గించేవాడు. ఇతరులను ధనాశతో మోసం చేసేవాడు. బాబా! ఈ వ్యక్తి కూడా మీ రూపమే అయితే సరిగ్గా ఆరు అణాల దక్షిణ ఇమ్మని అడగాలి అనుకుంటే అలాగే అడిగాడు.
5. నైమిశారణ్యములో ఆనందమాయి అమ్మగారి దగ్గర మరికొంతసేపు ఉండడమా లేక వెంటనే అందరితోపాటు వెళ్ళిపోవడమా అనే సంశయం గల్గినప్పుడు నేనడుగకనే అమ్మ నాకు ప్రసాదమిస్తే వెళ్ళమని ఆదేశము ప్రసాదం ఇవ్వకుంటే ఉండమని ఆదేశమనుకుంటే వెంటనే అమ్మ ప్రసాదం ఇస్తారు.
6. వారు చేశారో లేదోగానీ ఆ సాయినాధుడు నాచేత చేయించారు. ప్రాణాపాయ పరిస్థితులలో చీపురు పుల్లను శ్రీ మాష్టారి గ్రంధాలలో ఎక్కడో ఒకచోట పెట్టి ఎడమవైపు మొదటిలైనులో ఉన్నదే మీ ఆదేశము బాబా అనుకోవడం.
7. శ్రీ సాయి లీలామృతంలో ఉండే అరుదైన ఒకటి రెండు సన్నివేశాలు ఎన్నుకొని వీటి రెంటిలో ఏది వచ్చినా ఆ పని చేయుమని మీ ఆదేశమని నమ్ముతాను. ఏదీ రాలేదు చేయవద్దని మీ ఆదేశమనుకుంటాను అని చీపురు పుల్ల సహాయంతో గ్రంధం తెరవడం.

## ఇష్టం అయిష్టం

మానవునికి తృప్తి, శాంతి, ఆనందము లేకుండా పోయేందుకు కారణము ఒక్కటే - భగవంతుడు మనలనే స్థితిలో ఉంచాడో ఆ స్థితిలో ఉండక - తృప్తి శాంతి ఆనందం అనుభవించక - ఏదో అందని ద్రాక్ష పండ్ల కొరకు అర్రులు చాస్తూ అవి అందనందున సహజసిద్ధంగా మన స్వభావమైన తృప్తి శాంతి ఆనందం కోల్పోతూ మన జీవితాన్ని మనమే దు:ఖమయం చేసుకుంటున్నాము. ఇందుకు కారణం కావాలి అనే కోరికే. ఇది ఇష్టము, ఇది అయిష్టము అనేవే. ఇంకొక విధంగా చెపితే రాగము,

ద్వేషము. ఏదీ కోరరాదని ఏ ప్రయత్నము చేయరాదని అర్థం కాదు. నీ ఇష్టమొచ్చిన ప్రయత్నాలు చేసుకో. వాటి ద్వారా ఖర్మ క్షయమౌతుందని బాగా గుర్తించు. నీ ప్రయత్నాలు ఫలిస్తే పొంగకు. నీ ప్రయత్నాలు విఫలమైతే కృంగకు పనిచేసేందుకే నీకు హక్కు కానీ ఫలము ఆశించరాదు అన్నది శాస్త్రం.

ఇష్టము అయిష్టము శ్రీ మాష్టారు ఎంత గొప్పగా, ఎంత లోతుగా, ఎంత చక్కగా ఆచరించి చూపారో చూడండి. (అన్నం తినేచోట అమేధ్యమున్నా అసహ్యం లేకుండా తింటాను అంటారు).

ఆ మహనీయుడు ఇష్టము అయిష్టము లేకుండా - అన్ని విషయాలలోనూ గురువుగారిమీదనే ఆధారపడ్డాడు. మనలను అలాగే చేయమంటున్నారు.

1. ప్రదక్షిణలు పారాయణ - దీక్ష చేసి గురువుగారి సందేశము అడగడం. ఉదా: వివాహం
2. అంత వ్యవధి లేదు - చీట్లు వేసి అడగడం. ఉదా: ఉద్యోగం
3. ఈ రూములోకి మొదటి వచ్చిన వారే సలహా ఇస్తే దాన్నే పాటిస్తా. ఉదా: విద్యానగర్ వదలి వెళ్ళడం.
4. నా భావమే కరెక్టయితే ఈ వ్యక్తి ఈ మాట అనాలి లేకుంటే నా భావమే అసత్యము. ఉదా: ఈ వచ్చిన వ్యక్తి నీ రూపమే అయితే ఆరణాలిమ్మని అడగాలి - అలా అడగకుంటే నీ రూపం కాదు అనుకుంటాను. ఉదా: జిల్లెళ్ళమూడి ఆశ్రమంలో సన్యాసి డబ్బు అడగడం.
5. నాకు మరికొన్ని క్రొత్త పద్ధతులు నేర్పారు. చీపురుపుల్ల సహాయంతో ఏదైనా గ్రంధం తెరచి ఎడమవైపు మొదటి లైనులో నా ప్రశ్నకు సమాధానముండాలి అనుకోవడం.



6. శ్రీ సాయిలీలామృతం గానీ మరొక గ్రంధం కానీ తీసుకొని చీపురుపుల్లతో గ్రంధం తెరిచినచోట ఫలానా లీల వస్తే ఇలా అని నిర్ణయం రాకుంటే ఇలా అని నిర్ణయం.
7. చీపురు పుల్లతో గ్రంధం తెరిచినచోట కుడిఎడమలలో ఇక్కడైనా నా సమస్యకు పరిష్కారం దొరికి నన్ను ఆచరణశీలుని చేయండి. ఉదా: పోస్టాఫీసు బాడుగకివ్వడం.

ఇరవై ఐదు సంవత్సరాల క్రితం "సుబ్బరామయ్య తీర్ధం, తీర్ధమని ఎగబడతారే - ఈ కురిసే వర్షమంతా ఆ మహనీయుని తీర్ధం కాదా? బావులలో ఊరే నీరంతా వారి తీర్ధం కాదా. ఇది మనం గుర్తించేదెప్పుడో" అన్నారు.

పది సంవత్సరాల క్రిందట జనవరి 1వ తేది మందిరంలో పూజచేసి వస్తున్నారు. ఉప్పు, పులుసు, కారం, నూనె శ్రీ స్వామివారి ఆజ్ఞమేరకు తినను గనుక ప్రతి నిత్యం ఏ ప్రసాదమూ తినను. ఈ రోజు జనవరి 1వ తేది గనుక శ్రీ స్వామివారి ప్రసాదంగా పచ్చిశెనగలు, సుండలు చేసి నివేదించి అందరికీ పెడుతున్నారు. ఒక్క శెనగ గింజ తీసుకొని పై పొక్కు తీసేసి (ఉప్పు, కారం, నూనె, తగిలి ఉంటాయి గనుక) తినాలనుకొని ప్రసాదాల దగ్గర కొచ్చాను. ప్రసాదమున్నది కానీ పెట్టేవారే లేరు. అతను ఏదో స్పూను తెచ్చుకునేందుకు వెళ్ళాడు. ఇక ఆయన వచ్చిందాకా ఎందుకని వస్తున్నాను. కానీ ఒక్కక్షణం ఆగిఉంటే ప్రసాదం తీసుకొని ఉందును కదా అని అనుకుంటూ నడుస్తున్నాను. "నిరంతరం నా ప్రసాదం తింటూనే ఉంటావు, మరలా ప్రసాదం, ప్రసాదమని కొటకలాడుతావేమి?" అని స్పష్టంగా వినపడుతుంది. వీధిలోని అల్లరే వినపడడం లేదు. "కొటకలాడడం" అనే ప్రాంతీయ పదం శ్రీ స్వామివారు తప్ప మరొక స్వామి వాడేది కాదు. మరి నిరంతరం ప్రసాదం

తినడమేమిటి? నాల్గుసార్లు కాకుంటే ఐదుసార్లు తింటాము, త్రాగుతాము. నాకు ఆ మాటలు అర్ధంకాక బాధ, మరొకవైపు ఇది శ్రీ స్వామి వారి మాటే అనే సంతోషము. బాధే ఎక్కువగా ఉంది. రెండు, మూడు నిమిషాలు ఆలోచనలో నడుస్తుంటే అష్టోత్తరంలో పంచభూతాత్మ స్వరూపాయనమ: అనే పదం మెరిసింది. ఎన్నిమార్లు పూజచేస్తే అన్నిమార్లు పంచభూతాత్మ స్వరూపాయనమ: అంటాము గానీ దాని అర్ధం మననం చేయము.

మనం నిరంతరం తినేది ప్రాణవాయువే గదా. అది తినకుంటే జీవించడమే దుర్లభం కదా! అలాగే నీరు, అగ్ని, భూమి, ఆకాశము. ఆహా ఈ విషయం గుర్తుకు రాగానే శ్రీ మాష్టారు 25 సంవత్సరాల క్రిందట చెప్పిన సత్యాన్నే నేడు శ్రీ వెంకయ్యస్వామి వారు చెప్పారు. మహనీయుల రూపాలు, కాలము వేరుకావచ్చు, పేర్లు వేరు కావచ్చు, కానీ ఆంతరంగికంగా అందరూ ఒకటే. దైవం ఒకటే. రూపము, పేర్లు మాత్రం అనంతము. ప్రతి జీవి యొక్క అణువణువునందునూ, ప్రతి నిర్జీవిలోనూ, ఆకాశము, అగ్ని, జలము, వాయువు, భూమి వారి రూపాలేనని అది నిరంతరం ఎరుకలో ఉంచుకుంటే ఇక వేరే సాధనలెందుకు" అంటారు శ్రీ మాష్టారు. ఈ విషయం అనుక్షణం గుర్తుంటే శత్రువులు ఉండరు, మిత్రులు ఉండరు, ఇష్టము లేదు, అయిష్టము లేదు. ఏకనాధ మహరాజు గారి స్థితి అదే. ఆచార్య భరద్వాజగారి స్థితి అదే. మనలను కూడా కేవల శ్రద్ధతో, నిరవధిక ఆనందం కావాలి అనేదే ధ్యేయంగా సాధన సాగించమంటారు శ్రీ మాష్టారు. కాషాయాంబరములు అక్కరలేదు. సంసారం వదలక్కర లేదు. ఆశ అనేది పోతే అంతా పోతుందంటారు శ్రీ స్వామి వారు.

<u>ఏకనాధ మహరాజ్ గారు</u>: పండరి విఠలుడు దర్శనమిచ్చి సంస్కృతంలో ఉండే భాగవతం మరాఠీలోనికి అనువదించమన్నారు. అలాగే



అనువధించాడు. సంస్కృత పండితుల ప్రాముఖ్యం పోయిందని కాశీలోని సంస్కృత పెద్దలకు ఫిర్యాదు చేశారు. వారు ఏకనాధుని మరాఠీ భాగవతాన్ని గంగలో పారవేయమని శాశిస్తారు. ఏకనాధుడు అలానే చేస్తారు. కానీ గంగాభవాని ప్రత్యక్షమై ఆ గ్రంధాన్ని తిరిగి ఏకనాధుని చేతులలో ఉంచుతుంది. ఏకనాధులు దైవాదేశాన్ననుసరించి అనువధించాడు. గంగలో పారవేయమంటే పారేశారు. వ్రాయమన్న వారు భగవంతుడే. గంగలో పారవేయమన్నవారు భగవంతుడే అనే భావం అంత స్థిరంగా ఉంది. మనమూ అలా ఉంటే నిరవధిక ఆనందం మనలను వదలదంటారు శ్రీ మాష్టారు.

ఒకప్పుడు శ్రీ మాష్టారుగారిని మానాన్నగారు మా ఇంటికి సత్‌సంగానికి తీసుకవచ్చారు. మా మిద్దెపైన సత్‌సంగం జరుగుతుంది. మా పిన్నమ్మ కుమారుడు పది సంవత్సరములు పిల్లవాడు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. అలాంటప్పుడు డాక్టరు దగ్గరకు తీసుకపోయేది అలవాటు. మా అన్న ఆ బిడ్డను భుజాన వేసుకొని గబగబా మిద్దె మెట్లెక్కి పోతున్నాడు. ఇదేంటి వాణ్ణి డాక్టరు దగ్గరకు తీసుకపోకుండా వారి దగ్గరకు తీసుకపోతే వారేమిచేస్తారని క్రింద అందరూ కంగారు పడుతున్నారు. అప్పుడు నాకు 15 సంవత్సరముల వయస్సు. నేనక్కడే ఉన్నాను. మాష్టారు గారు ఆ పిల్లవానివైపు కూడా చూడకుండా ఆగు అన్నట్లు చేత్తో సైగ చేసి తన ఉపన్యాసము కొనసాగించారు. ఆగు అని సైగచేయగానే ఆ పిల్లవాని ఫిట్స్ ఆగిపోయాయి. ప్రసంగమయ్యాక చిటికెడు విభూతి ఆ పిల్లవాని నోటిలో వేసి నుదుట పెట్టి ఆ పిల్లవాడిని గాలి బాగా తగిలేచోట పడుకోబెట్టమన్నారు. అంతే ఆ పిల్లవానికి మరలా ఫిట్స్ రాలేదు.

శ్రీ మాష్టారుగారిని మా నాన్నగారు మాచేలోకి తీసుకపోతున్నారు. అక్కడికి వాహనములు పోవు. నడిచేపోవాలి. దోవలో ముండ్లుంటే నేను మాష్టరుగారిని నా చెప్పులు వేసుకోమని అడిగాను వారేమీ చెప్పకుండా నడుస్తూనే ఉన్నారు. రెండవసారి అడిగాను. నావైపు తీక్షణంగా చూచారు. దోవలో ముండ్లూ పల్లేరుకాయలున్నాయి. ఈ మూడవసారి నా చెప్పులు వారి ముందు వదలి వేసుకోమన్నాను. ఇంకేమీ చెప్పకుండా నా చెప్పులు వారు వేసుకున్నారు. ఇంటినుంచి బయలుదేరింది మొదలు తిరిగి ఇంటికి వచ్చినంతవరకు శ్రీ మాష్టారికి గొడుగు పట్టుకునే భాగ్యం కలిగింది. మహనీయులంటేను అందులో శ్రీ మాష్టారంతటి మహనీయులని ఎరుగక వారు ధరించిన పాదరక్షలు తిరిగి నేను ధరించి వారి అనుగ్రహాన్ని వృధా చేసుకున్నాను.

ఇట్లు
K. దుర్గాప్రసాద్, సరూర్ నగర్, హైదరాబాద్

నెల్లూరు జిల్లా కొత్తపాలెం వాస్తవ్యులు శ్రీమతి రామిరెడ్డి సరస్వతమ్మగారు ఇలా వ్రాస్తున్నారు. పూజ్యశ్రీ మాష్టరు గారికి ఏ వ్యక్తి ఎలాంటివాడు, వారి హృదయగత భావాలన్నీ వారికి అనుక్షణమూ తెలుస్తూనే ఉంటాయి కానీ వారెంతో గుప్తంగా ఎదుటివారికి తనగుట్టు తెలియకుండా మెసలేవారు.

ఒకరోజు నేను వారికొరకు క్రొత్త చెప్పులు, రెండు లుంగీలు తీసుకవెళ్ళాను. చెప్పులు, లుంగీలు బాబా పటాల దగ్గర ఉంచాను. నేను వాటిని తెచ్చిన విషయం వారికి చెప్పనేలేదు. స్నానం చేసి వచ్చి నేను తెచ్చిన లుంగీలలో ఒకదాన్ని కట్టుకున్నారు. తన చెప్పులు వాసిరెడ్డిగారి బంగ్లా దగ్గర మరచిపోయానని చెపుతూ నేను తెచ్చిన కొత్త చెప్పులు



ధరించి కాలేజీకి వెళ్ళారు. యద్భావం తద్భవతి అన్నట్లు మన భావాన్ననుసరించి వారు ప్రతిస్పందించేవారు. అన్నీ నాకు తెలుసునని ఎన్నడూ ఎవ్వరికీ చెప్పరు. ఎక్కడో వేలసంఖ్యలో ఒకరిద్దరితో అన్నారు, "ఓరేయ్! ఒక్కసారి మీ ముఖంలోకి చూస్తే చాలు మీ వ్యవహారమంతా తెలిసిపోతుంది" అన్నారు.

ఒకరోజు (పి.సుబ్బరామయ్య) నేను ఇంట్లో అందరికీ బాధ కల్గించి చపాతీలు తీసుకపోతే వాటిలో ఒక్క ముక్క అయినా తినమంటుంటే, ఓ! అలాగే అంటున్నారు కానీ కనీసం తాకనుకూడా తాకలేదు. కిళ్ళీ ఎక్కడ ఉన్నదో ఏమో, చెయ్యి కడుకొని కిళ్ళీ నములుతున్నారు. నా చపాతీలు తాకని కారణం నాకు బాగా అర్ధమైంది. ఇంట్లో అందరి మనసు బాధ పెట్టితేవడమే. మరొకరోజు ఉప్పులేకుండా ఉడికించిన అరటి కాయముక్కలు, నా పెరుగన్నం పెట్టుకొని కారియర్ తీసుకపోతూ మార్గమధ్యంలో చాపల్యానికి లోనై ఒక్క దబ్బతీసి నోట్లో వేసుకున్నాక గుర్తొచ్చింది. అయ్యో ఈ దబ్బలన్నీ మాష్టారికి పెట్టి ఉందును గదా. వీటిని ఎంగిలి చేశానే అని బాధపడ్డాను. శ్రీ మాష్టారి దగ్గరకు వెంకటగిరి పోయాను. వేళగాని వేళ సాయంత్రం 6 గంటలకే తనకు ఆకలౌతుంది, అన్నం తింటే బాగుండునే అన్నారు. తినండి సార్ అని ఉప్పులేని నా పెరుగన్నం, అరటి కాయముక్కలు (దోవలో ఎంగిలి చేసినవి) పెట్టేశాను. అన్నం తిన్నాక నిత్యం వారికొరకొచ్చే కారియర్ వచ్చింది. ఇదేంటి ఇందాక నేను తిన్న అన్నం ఎక్కడిదన్నారు. అది నాది సార్, నేను దుర్మార్గంగా ఎంగిలి కూర పెట్టాను అని, కథ వివరించాను. చూచావా బాబా ఎంతమంచిగా చక్కని బోధచేశారో, ఎట్టి పరిస్థితుల లోనూ ఎవ్వరినీ బాధపెట్టకూడదు. అలా బాధపెడితే శ్రీ సాయిని బాధపెట్టినట్లే అని ముగించారు.

శ్రీ చల్లా సుబ్బరాయలు - విద్యానగర్ వారు తన కుమార్తె వెంకట సుబ్బమ్మను ఆమె వివాహం కాకముందు రక్షించిన వివరం.

నేను చాలా సంవత్సరాలుగా శ్రీ మాష్టారి సత్‌సంగరూముకు వెళ్ళేవాడిని. అప్పటికి ఇంకా విద్యానగర్ సాయి మందిరం కట్టలేదు. మా అమ్మాయి పెండ్లీడు వయస్సు. కాలుకు బోధకాలు జబ్బువచ్చి తొడదగ్గరనుండి బాగా వాచి ఉంది. ఎందరో డాక్టర్లు ఎన్నివేల రూపాయలలో ఖర్చు తప్పితే ఏమీ గుణం లేదు. ఒకరోజు నా బాధ శ్రీ మాష్టారికి చెప్పుకున్నాను. పెద్దాయనకు చెప్పుకో, ఆయన తప్పక బాగుచేస్తారని చెప్పారు. ఎన్నాళ్ళుగానో చెప్పుకుంటూనే ఉన్నాను. కానీ ఫలితం లేదు. శ్రీ మాష్టారితో చెప్పిన తర్వాత ఎవరో బోధకాలు స్పెషలిస్టు అడ్రసు చెపితే అక్కడకు తీసుకవెళ్ళాను. మూడువందల రూపాయలిస్తే కట్టుకడతాను. ఈరోజు రేపు ఇక్కడ ఉండాలి. కోడికూర, నిమ్మచారుతో అన్నం తినాలి. మూడవనాడు ఈమెకు కాలు బాగయ్యేది, లేనిది చెపుతానన్నాడు. సరేనని మూడువందలిచ్చి కట్టు కట్టించాను. మేము వెళ్ళిన ఇరవై నిమిషాలులో మరొక బోధకాలుగల ఆమె వైద్యం కొరకొచ్చింది. ఆమెకు కూడా మాకు చెప్పినమాటే చెప్పారు. అయితే వాళ్ళు కోడికూర, నిమ్మచారు దొరకవని వెళ్ళిపోవాలన్నారు. నేను మా అమ్మాయికి తెస్తాను కనుక వాళ్ళకు అన్నం, కూర తెస్తానని చెప్పి ఆమెకు కూడా కట్టు కట్టించాము. ఆస్పత్రి వరండాలో పడుకున్నాము. రాత్రి ఒంటిగంట ప్రాంతములో మా అమ్మాయికి మాత్రం కాలు విపరీతమైన నొప్పిచేసి క్రింద దొర్లాడుతుంది. రెండు మూడు గంటల తర్వాత మరలా నిద్రపోయింది. తెల్లవారి నేను అన్నం కూర ఇద్దరికీ తెచ్చాను. మా అమ్మాయితో కూడా కట్టు కట్టించుకున్న ఆమె, ఆమెకు వచ్చిన స్వప్నం వివరించింది. మా అమ్మాయి పడుకోనుంటే ఆమె ప్రక్కన ఒక గడ్డం ఉన్న వ్యక్తి కూర్చొని ఆమెను ఆశీర్వదిస్తున్నట్లు వచ్చిందట.



మీరెవరైనా ఋషులు, సాధువుల దగ్గరకు పోతుంటారా అని అడిగింది. మేము అవునని చెప్పాము. అమ్మాయి ఇలా బాధపడి దొర్లాడిందని డాక్టరుకు చెపితే, ఈమెకు ఇక ఫైలేరియా బాధ ఉండదన్నారు. కట్టువిప్పితే అంతవాపు ఏమైందోగానీ రెండు కాళ్ళకు బేధం లేకుండా పోయింది. మరలా ఆ జబ్బురాలేదు. ఆమెకు వివాహం చేశాము. ప్రక్కామె స్వప్నంలో గడ్డం గల వ్యక్తి కన్పించారంటే శ్రీ మాష్టారే అలా కనిపించారని కృతజ్ఞతతో ఉన్నాము. జీవితాంతం పడవలసిన బాధను ఒక్కమాటతో పోగొట్టిన మాష్టారికేమిచ్చి ఋణం తీర్చగలము.

ప్రతిరోజు శ్రీ మాష్టారిని దర్శించే నేను ఒకప్పుడు వరుసగా పదిరోజులు వెళ్ళలేదు. ఏమి ఈమధ్య కనపడడంలేదే అన్నారు. రాజకీయాల్లో తిరుగుతున్నందున వీలుకాలేదు సార్ అన్నాను. వెంటనే శ్రీ మాష్టరుగారు "నీవు రాజకీయాలలో నుండి విరమించుకో, ఇక వాటి జోలికి పోవద్ద"న్నారు. నేను వారి ముందు మౌనంగా ఉన్నాను. కానీ రాజకీయాలు మానలేదు. ఆర్థికంగా చాలా బాగున్న కాపురం క్రమేణా దిగజారిపోయింది. నాకు ఉండే చిల్లరంగడిని నాకుమారునికి అప్పగించి నేను రాజకీయాల్లో తిరుగుతున్నాను. నా కుమారుడు నాలుగు లక్షలరూపాయలు అంగడిలో పోగొట్టాడు. దానితో కూడా ఉమ్మడి సంసారమైనందున శక్తికి మించిన ఖర్చులు. అదే సమయంలో నా ఒక్క ఇల్లే ఒకరోజు అగ్నికి ఆహుతైంది. ఆ తర్వాత పూర్తిగా రాజకీయాలు మానేశాను. క్రమంగా కోలుకొని నేడు చీకూచింతలేకుండా హాయిగా ఉన్నాను. ఏనాటికైనా వారినోటిగుండా వచ్చినమాట జరిగితీరవలసిందే. రాజకీయాలు మానమంటే నేను మానలేదు. కానీ వారే నాచేత మాన్పించారు. వారి దివ్యవాక్కుల ప్రభావమలాంటిది.